క్లుప్తంగా

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కేవీపల్లె : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ నారమాకులమిట్టలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి భార్య శాంతకుమారి జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తుహోమం, దాన్యాధివాసం, కుంభాభిషేకం, జలాధివాసం, మూల మంత్ర క్షీరాధివాసం తదితర పూజా కార్యక్రమాలు, హోమాలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపీనాథ్‌రెడ్డి, ప్రవీణ, చిన్నరెడ్డి, జయలత, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

పీలేరు రూరల్ : పారదర్శకంగా భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణం, రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలో భూముల రీసర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత పీలేరు, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె, యర్రగుంట్లపల్లె, వేపులబైలు, దొడ్డిపల్లె గ్రామాల్లో డ్రోన్ సాయంతో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే నిర్వహించి సరైన హద్దులు నిర్ణయించడం తోపాటు రికార్డులు పారదర్శకంగా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్ ఉమాపతి, డ్రోన్ టీమ్ పైలట్ మహమ్మద్ హనీఫ్, నాయకులు చిన్న, నాగరాజనాయక్, మునీర్, రమణ, రియాజ్, అబీద్, ఈవో రెడ్డిప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

పీలేరు : ప్రతి కుటుంబం అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు మరోమారు ఆదరించాలని యువ పారిశ్రామిక వేత్త జి.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డులో యల్లమంద క్రాస్, కావలిపల్లె ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, ఉదయ్‌కుమార్, కృష్ణారెడ్డి, షాకీర్, బాలం నరేంద్రరెడ్డి, హుమయూన్, ఉమాకాంత్‌రెడ్డి, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అరుణ, నరేష్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కలకడ : క్రీడలతో ప్రతి ఒక్కరిలో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. వారం రోజుల పాటు మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గెలుపు, ఓటములను పక్కన పెట్టి ఆటలను ఆస్వాదించాలన్నారు. 16జట్లు టోర్నమెంట్‌లో పాల్గొనగా విజేతగా నిలిచిన కలకడ మండలం కె.మాదిగపల్లె జట్టుకు, రన్నర్‌గా నిలచిన కె.వి.పల్లె మండలం తిమ్మాపురం వడ్డిపల్లెకు నగదు బహుమతి, మొమెంటోలు అందజేశారు.

'కాన్పులకు ముహూర్తాలు వద్దు'

పీలేరు : మంచి జాతకం పేరుతో కాన్పులకు ముహూర్తాలు పెట్టరాదని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తలపుల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ సాధారణ సుఖప్రసవం తల్లీబిడ్డలకు ఆరోగ్యకరమని పేర్కొన్నారు. గర్భిణులకు రక్త హీనత లేకుండా తీసుకోవాల్సిన ఆహారం, ప్రభుత్వ పథకాలు, టీకాలు, తల్లిపాల ప్రాధాన్యత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, కృష్ణయ్య, కుసుమ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వాల్మీకిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని మదనపల్లి ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా 30మంది టిబి వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని మొదటి దశలో గుర్తించి సరైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చునన్నారు. బీడీ, సిగరెట్టు, మందు, పొగాకు తదితరవాటికి దూరంగా ఉండాలని సూచించారు.

పాడి.. జీవ నాడి

రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన నాటు ఆవులతో ఓ పాడిరైతు అధిక లాభాలను ఆర్జిస్తున్నాడు. 30 ఎకరాల్లో ఒక వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేసుకుని పలు రకాల జాతి ఆవులను పోషిస్తూ రోజుకు 80 నుంచి 100 లీటర్ల పాలను సేకరిస్తున్నాడు. తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ పాడిరైతు అవార్డును సైతం అందుకున్నాడు.

- పలురకాల జాతులతో అధిక లాభాలు
- రోజుకు 80 నుంచి 100 లీటర్ల పాలు సేకరిస్తున్న వైనం
- నెలకు రూ.2 లక్షల ఆదాయం ఆర్జిస్తున్న పాడిరైతు


వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాఠీ జాతి ఆవులు

ములకలచెరువు : విజయనగరం జిల్లా సాలేరుకు చెందిన డీవీవీఎస్ వర్మ 15 ఏళ్ల క్రితం ములకలచెరువు మండలంలోని సోంపల్లె పంచాయతీ జవకల కోటలో స్థిరపడ్డారు. 30 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఒక వ్యవసాయ క్షేత్రం ఏర్పాటుచే సుకున్నాడు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు ఒంగోలు, పుంగనూరు ఆవులతో పాడి పరిశ్రమ స్థాపించి నెలకు రూ. 2 లక్షల ఆదాయం సంపాదిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం రాజస్థాన్ రాష్ట్రం గాంధీనగర్‌లో 24 రాఠీ నాటు ఆవులను ఒక్కొక్కటి రూ.45 వేల నుంచి రూ.లక్ష వరకు విలువజేసే ఆవులను కొనుగోలు చేశారు. ప్రస్తుతం 30 ఆవులు 10 దూడలను పెంచుతున్నాడు. వీటి ద్వారా రోజుకు 80 నుంచి 100 లీటర్ల వరకు పాలను సేకరిస్తూ పలువురికి విక్రయిస్తున్నారు. ఈ పాల ద్వారా వచ్చిన వెన్నను నెయ్యిగా మార్చి లీటరు నెయ్యి రూ.3500కు విక్రయిస్తున్నాడు. ఈ నెయ్యికి బాగా గిరాకీ ఉంది. ఈ నెయ్యి కోసం పక్క జిల్లాల నుంచి వస్తుంటారని రైతు చెబుతున్నాడు. అలాగే నేచురోపతి మందుల తయారీకి కంపెనీల ప్రతినిధులు ఇక్కడికే వచ్చి నెయ్యి తీసుకెళ్తుంటారని అంటున్నారు. ఎక్కువగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు, తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరాల నుంచి వస్తున్నారు. ఈ పాడి రైతును పలువురు రైతులు ఆదర్శంగా తీసుకొని ఆవైపు మొగ్గు చూపుతున్నారు.

నాలుగు తరాల నుంచి ఆవుల పోషణే..

మా తాతలు, ముత్తాతల నుంచి నాలుగు తరాలుగా నాటు ఆవుల పోషణే మా జీవనాధారం. నాకు కూడా చిన్నపటి నుంచి నాటు ఆవుల పోషణ అంటే ఇష్టం రాజస్థాన్ నుంచి రాఠీ ఆవులు తెచ్చి వాటిని కంటికి రెప్పలా చూసుకుంటున్నా. వాటి పాల నుంచి నెయ్యి తీసి విక్రయించి మంచి లాభాలు సాధిస్తున్నాను. ఈ ఆవుల నెయ్యికి మంచి డిమాండ్ ఉంది. ఈ నెయ్యిని కంపెనీలు 12 రకాల టెస్టులు చేసి మందుల తయారీకి ఉత్తమమైందని తేల్చారు.

– డీవీవీఎస్ఎస్ వర్మ, పాడిరైతు, ములకలచెరువు

మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : రాష్ట్రంలో అన్ని వర్గాలకు మంచిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని ముష్టూరు పంచాయతీలోని పారాసువారిపల్లె, చల్లావారిపల్లె, మర్రిబండ, వలసపల్లె, ముష్టూరు గ్రామాల్లో సర్పంచ్ చంద్రాయుడు, ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను అందించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, సిమెంట్‌రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, కొత్తగా విద్యుత్‌స్తంభాల ఏర్పాటు, పాత విద్యుత్ స్తంభాల మార్పుతో పాటు, అధికంగా రెవెన్యూ సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలోని 99శాతం హామీలను అమలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు.

నీ చదువు బాధ్యత నాదే..

ఎమ్మెల్యే మర్రిబండ గ్రామపర్యటనలో భాగంగా విద్యార్థిని అక్షయ ఎంతవరకు చదివినా తానే చదివిస్తానని హామీ ఇచ్చారు. స్థానికుడైన వెంకటరమణారెడ్డి మనవరాలు అక్షయకు తల్లిచనిపోగా తండ్రి వేరొకరిని పెళ్లిచేసుకుని వెళ్లిపోవడంతో విద్యార్థిని స్థానిక కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి చదువుకుని నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరింది. ఆమె చదువుకు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యురాలికి పరామర్శ..

ఇటీవల నిమ్మనపల్లెలో జరిగిన వైఎస్సార్ ఆసరా సభ నుంచి ఇంటికి వస్తూ ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచాన ఉన్న స్వయంసహాయక సంఘం మహిళను ఫజురున్నీసాను చల్లావారిపల్లెలో పరామర్శించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎంపీపీ పూర్ణచంద్రిక


మాట్లాడుతున్న ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక

పెద్దమండ్యం : గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వేగవంతం చేయాలని, అలాగే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెలకు, వ్యవసాయానికి విద్యుత్ సర్వీసులకు సబ్‌స్టేషన్‌ల ద్వారా వేరువేరుగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు ఏఈ తెలిపారు. త్వరలో ఈ పనులను ప్రభుత్వం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజున విద్యార్థులకు విద్యాకానుక కిట్‌లు అందిస్తామని తెలిపారు. ఆర్‌బికేల ద్వారా ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ తెలిపారు. రైతులకు కావలసిన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జగనన్న కాలనీలలో పక్కాగృహాల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నట్లు ఏఈ తెలిపారు. వాటర్‌షెడ్ ద్వారా రైతులకు ఇస్తున్న పివిసీ పైపులు నాణ్యమైనవి పంపిణీ చేయాలని సభ్యులు కోరారు. ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్చిల నిర్మాణం, ప్రహరీ నిర్మాణానికి బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌లు విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుక్కే పీరమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, తహశీల్దార్ రాము, ఏఈ శంకర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్‌లు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు


హరీష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కేవీపల్లె : ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ హరీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కేవీపల్లె మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మదనపల్లెలో హరీష్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, పార్టీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు సతీష్‌రెడ్డి, యెలిశెట్టి వెంకటరమణ, దినేష్‌రెడ్డి, సి. యల్లయ్య, హరిబాబు, రవికుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి, కిషోర్‌రెడ్డి, యర్రంరెడ్డి, సైపుల్లాఖాన్, మునిశేఖర్, సురేష్, ఎల్ఐసీ రవీంద్రారెడ్డి, మల్లికార్జున, సంజీవరెడ్డి, రవిచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ధర్మారెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, చక్రధర్, లోకనాథరెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుర్రంకొండ, కలికిరి, కలకడలో హరీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వాల్మీకిపురం, చింతపర్తిలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, జెడ్పీటీసీ నిర్మల, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ప్రోత్సాహకాలు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణించే క్రీడాకారులను ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు డీఎస్‌డీఓ షేక్ షఫీ అన్నారు. శుక్రవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో హాకీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం జరిగింది. రూ.లక్ష విలువ చేసే హాకీ స్టిక్స్, మెటీరియల్‌ను క్రీడాకారులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో 50 చోట్ల వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం హాకీలో మెళుకువలు నేర్పించినట్లు తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ మదనపల్లె క్రీడలకు పుట్టినిలన్నారు. హాకీ కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్, వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, టౌన్ బ్యాంకు సీఈఓ ప్రసాద్, నెమలి రమణరావు పాల్గొన్నారు.